

# THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

తెలుగు — SATYA VANI

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం 2-30 ని॥లకు

ఇంగ్లీషు — THE VOICE OF TRUTH

| | |
|---|---|
| సోమవారము | 9-00 to 9-15 p.m. |
| బుధవారము | 9-30 to 9-45 a.m. |

హిందీ — SATYA SUSAMACHAR

| | |
|---|---|
| మంగళవారము, గురువారము, శుక్రవారము | 9-00 to 9-15 p.m. |
| ఆదివారము | 1-30 to 1-45 p.m. |

తమిళం — SATYA VAZHI

| | |
|---|---|
| మంగళవారము | 5-30 to 5-45 p.m. |
| గురువారము, శుక్రవారము | 6-45 to 7-00 p.m. |

మలయాళం — THE VOICE OF TRUTH

| | |
|---|---|
| మంగళవారము, శుక్రవారము | 3-45 to 4-00 p.m. |

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.

తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరి ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి :

**SATYA VANI**
**P.O. Box 80**
**KAKINADA – 533 001**

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్. కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్టు బాక్సు - **80**, కాకినాడ - **533 001**

ఎడిటర్ : జె. సి. ఛోటే

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక **11** జూన్ **1985** సంపుటి **5**


# సంపాదకీయము

## పరిచర్యలోను యిచ్చుటలోను ఆనందము

## *(The Joy of Serving and Giving)*

క్రైస్తవులు ఈ లోకంలో బహుగా ఆశీర్వదించబడిన ప్రజలు. ఈ లోక జీవనసంబంధమైన సంగతులనే గాక క్రీస్తు యేసునందున్న ఆత్మీయాశీర్వాదములన్నిటిని మనము కలిగియున్నాము. ఇంకో మాటలో ఈ లోకం యిచ్చే శ్రేష్ఠ సంగతులనే గాక, నిత్యజీవ నిరీక్షణను మనం కలిగియున్నాము.

క్రైస్తవులయితే వారు మంచి సంగతులన్నింటినీ విసర్జించాలని కొందరు అనుకొంటారు. అది సత్యము కాదు. మంచిదైనదేదియు విడిచిపెట్టాలని ప్రభువు ఎవరినీ ఎన్నడు కోరలేదు. కాని చెడ్డవాటిని విడిచిపెట్టి ఒకడు మారుమనస్సు పొంది తిరగాలని ఆయన కోరుచున్నాడు (లూకా 13:3; అపొ. కా. 17:30).

నీవేమి విసర్జించుతావో యనే దానిపై గాక నీవేమి పొందుతావో యనే దానిపై మనం యోచించాలి. నీవేమి చేయుచున్నావో ఆలోచించు. నీచెడు అలవాట్లన్నిటినిగూర్చి యోచించు. నీవొక వేళ

తాగుడుకు అలవాటు పడ్డావేమో, లేదా పొగ తాగుచున్నావేమో. బహుశ నీవు జూదానికి, లాటరీలకు, మొదలగు అట్టి వాటికి అలవాటు పడ్డావేమో. అంతకన్నా చెడ్డవాటిని గూర్చి నీవు దోషివి కావచ్చును. అయితే యివి నీకెట్లు సహాయపడుచున్నవి? అవి నీ జీవితానందమని చెప్పగలవా? అవి నీ ఆరోగ్యాన్ని క్రమంగా నాశనం చేయుచున్నవి. నీవు చాల డబ్బును పాడుచేస్తున్నావు. ఎవరు లాభం పొందుచున్నారు? దానియంతటిని బట్టి నీకు సహాయం కలిగినదా? దానివలన నీ కుటుంబం అభివృద్ధి జెందినదా? నా మిత్రుడా, నీ జీవితంలో యిటువంటి సంగతులు పాపమని బైబిలు చెప్పుచున్నది. పాపము నీ కేమి చేస్తుంది? అది నిన్ను నాశనం చేస్తుంది. నీ ఆత్మను నాశనం చేస్తుంది. "ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" (రోమా 6:23). నీవు దేవునికి లోబడినప్పుడు. నీలోని సంగతులు వెంటనే మారడం మొదలుపెడతాయి. మొదటిగా ప్రభువు నీ పాపాలను క్షమిస్తాడు. అప్పుడొక గొప్ప బరువును దింపేసినట్లు నీకగుపడతాది. శాంతి సమాధానములుంటాయి. నీవిప్పుడొక నూతన వ్యక్తి. నీ యెదుట ఒక నూతన జీవితం ఉన్నది. నీకు నూతన మిత్రులుంటారు. ఇప్పుడు నీ ప్రేమను కుటుంబానికివ్వగలవు, వారి అవుసరాలను తీర్చగలవు. నీ ఉద్యోగంలో నీవు మార్పునొందుతావు. నీ పనిని చేయడానికి ఆసక్తి కలిగియుంటావు. ఏం జరిగింది? నీవు క్రైస్తవుడయ్యావు. "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి, పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" అని పౌలు చెప్పాడు (2 కొరింథీ 5:17).

ఇప్పుడు నీవు క్రీస్తువాడవు గనుక నీవిదివరకేమై యున్నావో యేమి చేసావో ఆలోచించకు. నీవొక పాపివి గాని ఇప్పుడు రక్షింపబడితివి. నీవు తప్పిపోతివి గాని యిప్పుడు కనుగొనబడితివి. నీ మిత్రులు

లోకస్థులు గాని యిప్పుడు మంచివారితో సహవాసం చేయుదువు. నీవిది వరలో యేమైయున్నావో ఎరిగినప్పుడు మరల ఆ స్థితికి ఎన్నడైనా వెళ్లడానికి ఎందుకు ఆలోచించాలి? చీకటిలో నుండి వెలుగులోనికి వచ్చిన తరువాత, మరల చీకటి నెందుకు ఆశించాలి? అపొ. పేతురు ఇట్లు వ్రాసాడు : "తన మహిమను బట్టియు గుణాతిశయమును బట్టియు, మనలను పిలిచిన వాని గూర్చిన అనుభవ జ్ఞానమూలముగా ఆయన దైవశక్తి జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయ చేయుచున్నందున దేవుని గూర్చినట్టియు మన ప్రభువైన యేసును గూర్చినట్టియునైన అనుభవ జ్ఞానము వలన మీకు కృపయు సమాధానమును విస్తరించును గాక. ఆ మహిమ గుణాతిశయములను బట్టి ఆయన మనకు అమూల్యములును అత్యధికములునైన వాగ్దానములను అనుగ్రహించి యున్నాడు. దురాశను అనుసరించుట వలన లోకమందున్న భ్రష్టత్వమును ఈ వాగ్దానముల మూలముగా మీరు తప్పించుకొని దేవ స్వభావమునందు పాలివారగునట్లు వాటిని అనుగ్రహించెను. ఆ హేతువు చేతనే మీమట్టుకు మీరు పూర్ణజాగ్రత్త గలవారై మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి. ఇవి మీకు కలిగి విస్తరించిన యెడల అవి మన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అనుభవజ్ఞాన విషయములో మిమ్మును సోమరులైనను నిష్ఫలులైనను కాకుండ చేయును. ఇవి ఎవనికి లేక పోవునో వాడు తన పూర్వపాపములకు శుద్ధి కలిగిన సంగతి మరచిపోయి, గ్రుడ్డివాడును, దూరదృష్టిలేనివాడు నగును. అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు. ఆలాగున మన ప్రభువును రక్ష

కుడునైన యేసుక్రీస్తుయొక్క నిత్యరాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును" (2 పేతురు 1:3-11).

నేను క్రైస్తవుడనైన తరువాత అంతా కట్టుదిట్టంగాయుండాలి. ప్రతి ఆదివారం ఆరాధనకు వెళ్లాలి, కానుకల నివ్వాలి, మొదలైనవి ఇంకా ఎన్నో చేయాలి కదా! యని కొందరడుగుతారు. వాటిని చేయాలని నీవు కోరుట లేని యెడల చెయ్యవద్దు. అదే నీ మనస్తత్వం అయితే క్రైస్తవుడవు కావద్దు. నిజానికి అటువంటి మనస్తత్వంతో నీవు క్రైస్తవుడవు కాజాలవు.

క్రైస్తవుడు నేనేమి చేయాలి? అని గాక, నేనేమి చేయగలను? అని అడుగుతాడు. నేనెంత తక్కువ ఇయ్యగలను అని గాక, నేనెంత ఎక్కువ ఇయ్యగలను? అని ఆలోచిస్తాడు. అతడు పరిచర్య చేయుంచుకోవడానికి గాక పరిచర్య చేయడానికి ఎదురు చూస్తాడు. క్రైస్తవ్యంలో నేనెంతఇయ్యాలో యేమేమి చేయాలో, ఏమేమి విడచిపెట్టాలో అనే సంగతులనుగూర్చే నీవు ఎల్లప్పుడు ఆలోచిస్తూ యుంటే, నిజానికి నీ హృదయాన్ని క్రీస్తుకు ఇయ్య లేదని అర్థమగుచున్నది. నీవు యేసును వెంబడించ ప్రయత్నిస్తూ, ఈ లోకాన్ని కూడా పట్టుకోవాలని తలంచుచున్నావు. యిది నీకు చాల కష్టతరం. నీవు ఈ లోకంలోనే యుండడానికో లేక క్రీస్తుతో యుండడానికో నిశ్చయించుకోవాలి. యేసు చెప్పిన ఈ మాటలను జ్ఞాపకముంచుకోవాలి: "ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగానుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు" (మత్తయి 6:24).

ఒకడు దేవునిగూర్చి, క్రీస్తునుగూర్చి తెలిసికొన్నప్పుడు, తాను పాపములోబడి నశించిన స్థితిలోయున్నానని గ్రహించి దేవునికి లోబడినప్పుడు, క్రీస్తు ననుసరించుటలో అతని దృక్పథము వేరుగా యుంటాది. పాపములు క్షమింపబడినవాడై కృతజ్ఞత కలిగిన

మనస్సుతో క్రైస్తవ జీవనమును గడుపును. అతని హృదయం సంతోషంతో నిండియుండును. అతడు ప్రభువును పూర్తిగా విశ్వసించును. ఆయన ఎక్కడకు నడిపిస్తే అక్కడకు ఆయన వెంట వెళ్ళడానికి సంసిద్ధుడగును. తన హృదయంలో ప్రభువుండును. క్రీస్తులో అతనికి నూతన సోదర సోదరీలుందురు, వారితో సహవాసము కలిగియుండును, ప్రభువు దినాన్న వారితో కలసి ఆయనను ఆరాధించును, స్తుతులు చెల్లించును. తన హృదయభారము తొలగించబడినందున ప్రతి దినచర్యలను క్రొత్త జీవితంతో, సంతోషంతో ఎదుర్కొనును. ప్రభువు వాడైనందుకతడు సంతోషించును. ఆయనకు సేవ చేయుటలో ఆనందించును. అతనికిప్పుడున్నదంతయు క్రీస్తుకు చెందును. ప్రభువుకు అతడు చేయగలిగినదంతయు చేయును. దీనిలో అతడు గొప్ప సంతృప్తిని కనుగొనును.

నా మిత్రుడా, యేసును నీవు వెంబడించాలని ప్రోత్సహించుచున్నాను. నీ జీవితాన్ని, తలాంతులను, శక్తిసామర్థ్యములను, ధనాన్ని, మొదలగువాటిని ప్రభువు కర్పించుము. యేసునుగూర్చి నీ మిత్రులకు చెప్పుము, ప్రభువు సేవలో పాల్గొనుము, సువార్తను బోధించుము, నీ బైబిలును చదువుము, వ్యక్తిగతముగాను, బహిరంగముగాను ప్రార్థించుట నేర్చుకొనుము. సంఘములో చేయవలసిన పని యేదైనా యుంటే దాన్ని చేయడానికి ముందుకు రమ్ము. నా సహోదరులందరూ అట్లు చేయగలిగితే వారున్నచోటనే క్రీస్తుకొరకు ఎంతో గొప్ప పని చేయగలరు. క్రీస్తులో కుటుంబాలు ఐక్యత కలిగియుండును. బీదలకు సహాయము దొరకును. బైబిలు కరస్పాండెన్సు కోర్సు పని గొప్పగా అభివృద్ధి చెందును. ఇంకా ఎక్కువ క్రైస్తవ సాహిత్యము ముద్రించ వీలగును. క్రొత్త స్థానిక సంఘాలు నెలకొల్ప వీలగును.

క్రైస్తవులుగాను, క్రీస్తు సంఘసభ్యులుగాను ఉన్నందుకు మనము సంతోషించాలి, ఒకరినొకరు పురికొల్పాలి. ప్రభువు పనిలో

మనం ఆసక్తిని కలిగియుండాలి. సువార్త వ్యాపింపజేయడానికి మన శక్తికొలదీ పనిచేయాలి.

నావంతు చేయడానికి అభ్యంతరం లేదుగాని, దానినంతా నేను చేయలేనని కొందరు చెబుతారు. నీవంతు యేమిటి? నీ పొరుగువాని వంతు యేమిటి? మరొకడు చేసినా చేయకపోయినా ప్రభువుకొరకు నేను అంతా చేయగలననే మనస్తత్వం మనం కలిగియుండాలి. మరొకని వలన నాకు రాబోయే ఆశీర్వాదములను నేను పోగొట్టుకో దలచ లేదు. నేను చేయగలిగినదంతా చేసినప్పుడు దానిని బట్టి యితరులు కొంతైనా చేస్తారని నా నిరీక్షణ.

మనం ప్రభువుకొరకు చేయగలిగింది చేయలేనప్పుడు, మనకు కలిగే ఆశీర్వాదాల్ని పోగొట్టుకొనుచున్నాము. మనం ఆయనను వెంబడిస్తూ నమ్మకముగా యుంటే, ఆయన మనతో యుండడానికి, సహాయం చేయడానికి, మనల్ని దీవించడానికి వాగ్దానం చేసాడు. మనం అట్లు చేస్తే ఆయన తప్పక తన వాగ్దానాన్ని నెరవేరుస్తాడు. మనం ఊహించినదానికంటే ఎంతో అధికంగా మనల్ని దీవిస్తాడు, గాని మనం వెనుకంజవేసి, చేయగలిగింది చేయక, ఆయనకు విధేయత చూపకయుంటే ఆయన మనల్ని దీవించలేడు. గనుక మనమేమి పొందాలనుకొనుచున్నామో అది చాల మట్టుకు మనపైనే ఆధారపడి యున్నది.

క్రైస్తవునిగా యుండడం ఎంత ఆనందమో, దాన్ని నీవింకా కనుగొనలేకపోతే, నీవు తప్పక దానికొరకు ప్రయత్నించు. నీ హృదయాన్ని నిజంగా నీవు క్రీస్తుకు సమర్పించి ఆయనకు విధేయత చూపినప్పుడు, ఈ గొప్ప ఆనందాన్ని నీవు కనుగొంటావు, గాని అంతకు ముందు కాదు.

# పరిశుద్ధాత్ముడు
## (The Holy Spirit)

—జె.సి. బెయిలీ.

(గత సంచిక తరువాయి)

సింతేకోస్తునాడు ఈయబడిన ఆత్మ వాక్యాన్ని మనం విని విధేయత చూపుతాం. దేవుడు ఈ సంకల్పములోను, ఈ సంకల్పముపైన ఉన్నాడు (ఎఫెసీ 4:6). అయితే పరిశుద్ధాత్మ బాప్తిస్మము సంగతి యేమిటని కొందరడుగుతారు. దీనినిగూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నదో చూద్దాం. ఇంకో మాటలో పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి పరిశుద్ధాత్ముడు యేమి చెప్పుచున్నాడో చూద్దాం. ఈ వాగ్దాన నెరవేర్పును యేసు మనకిచ్చాడు. బాప్తిస్మమిచ్చు యోహాను ద్వారా చేయబడిన వాగ్దానం యిది: "మారుమనస్సు నిమిత్తము నేను నీళ్ళలో మీకు బాప్తిస్మమిచ్చు చున్నాను; అయితే నా వెనుక వచ్చుచున్న వాడు నాకంటె శక్తిమంతుడు; ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను; ఆయన పరిశుద్ధాత్మతోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును" (మత్త 3:11). తరువాత అగ్ని బాప్తిస్మ మేలాగుంటాదో యోహాను మనకు చెప్పుచున్నాడు. పొట్టును కాల్చివేసే ఆరని అగ్ని అది. పునరుత్థానుడైన తరువాత యేసు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి మనకు చెబుతున్నాడు. దీనిని మీరు నాతో జాగ్రత్తగా పఠించాలని కోరుచున్నాను:

## ఆత్మ బాప్తిస్మము

"ఓ థెయొఫిలా, యేసు తాను ఏర్పరచుకొనిన అపొస్తలులకు పరిశుద్ధాత్మ ద్వారా ఆజ్ఞాపించిన తరువాత ఆయన పరమునకు చేర్చుకొనబడిన దినమువరకు ఆయన చేయుటకును బోధించుటకును ఆరంభించిన వాటినన్నిటిని గూర్చి నా మొదటి గ్రంథమును రచించితిని.

ఆయన శ్రమపడిన తరువాత నలువది దినములవరకు వారి కగుపడుచు, దేవుని రాజ్య విషయములను గూర్చి బోధించుచు అనేక ప్రమాణము లను చూపి వారికి తన్ను తాను సజీవునిగా కనుపరచుకొనెను. ఆయన వారిని కలిసికొని యీలాగు ఆజ్ఞాపించెను - మీరు యెరూషలేము నుండి వెళ్ళక, నా వలన వినిన తండ్రియొక్క వాగ్దానముకొరకు కని పెట్టుడి; యోహాను నీళ్ళతో బాప్తిస్మము ఇచ్చెను గాని కొద్ది దినముల లోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరనెను" (అపొ.కా. 1:1-5). యేసుప్రభువు ఈ మాటలు అపొస్తలులకు మాత్రమే చెప్పె నని గమనించుము. గనుక పరిశుద్ధాత్మ బాప్తిస్మము అపొస్తలులకు వాగ్దానము చేయబడెను. వేరే ఎవరికైనా అది ఇయ్యబడునని వాగ్దానం చేయబడలేదు. ఇప్పుడు మనం అపొ. కా. 2 అధ్యాయం చూద్దాం: "పెంతెకొస్తను పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒక చోట కూడియుండిరి. అప్పుడు వేగముగా వీచుబలమైన గాలివంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను, మరియు అగ్ని జ్వాలలవంటి నాలుకలు విభా గింపబడినట్టుగా వారికి కనబడి వారిలో ఒక్కొక్కనిమీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్ శక్తి అనుగ హించినకొలది అన్యభాషలతో మాటలాడసాగిరి" (అపొ. కా. 2:1-4).

పరిశుద్ధాత్ముడు వచ్చినప్పుడు తత్ఫలితముగా అపొస్తలులు పరి శుద్ధాత్మ శక్తివలన మాటలాడసాగారు. వారు క్రీస్తుయొక్క అద్భుత ములను ఆ ప్రజలకు వివరించి చెప్పారు. మనం విశ్వాసులమై రక్షింప బడునట్లు యేసు ఈ యద్భుతాలను చేసాడు. పరిశుద్ధాత్ముడు నేరుగా మనమీద పనిచేయుటవలన గాక, యేసు చేసిన అద్భుతాలద్వారా ఆయనయందు మనం విశ్వాసులము కాగలము (యోహాను 20:30, 31). గనుక పేతురు పరిశుద్ధాత్ముని సహాయంవలన మొదట యేసు చేసిన అద్భుతాలను గూర్చి బోధించాడు. సువార్త యందలి విశ్వా

సేమువలనే మనం రక్షించబడతాము: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని యేసు ప్రభువు చెప్పాడు (మార్కు 16:15, 16). క్రీస్తుయొక్క మరణ, సమాధి, పునరుత్థాన వాస్తవములే సువార్త అని పౌలు చెప్పాడు (1 కొరింథీ 15:1-4). పెంతెకొస్తునాడు పేతురు చేసింది అదే - అతడు క్రీస్తుయొక్క మరణ సమాధి పునరుత్థానముల వాస్తవాలను బోధించాడు. పేతురు తన ప్రసంగపు మొదటి భాగాన్ని ఈలాగు ముగించాడు: "మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెను" (అపొ. కా. 2:36). ఈమాట వినగానే మనుష్యులు బోర్లా పడిపోలేదు, గాని వారొక ప్రశ్న వేశారు. పేతురు చెప్పినదానిని వారు నమ్మారు. పరిశుద్ధాత్ముడు ఇచ్చిన సందేశాన్ని వారు నమ్మారు. అందువలన వారొక ప్రశ్న వేశారు:

## విధేయులకు పరిశుద్ధాత్మ వరము

"వారు ఈమాట విని హృదయములో నొచ్చుకొని - సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడుగగా, పేతురు - మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని చెప్పెను (అపొ. కా. 2:38). పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన వారికి పరిశుద్ధాత్మ అను వరము ఇయ్యబడునని అతడిక్కడ చెప్పాడు. యిది అపొ. కా. 5:32 లో విశదీకరించబడింది: "మేమును, దేవుడు తనకు విధేయులైనవారికి అనుగ్రహించిన పరిశుద్ధాత్మయు ఈ సంగతులకు సాక్షులమై యున్నామని" పేతురు చెప్పాడు. పరిశుద్ధాత్ముడు ఇక్కడ ఒక వాగ్దానము చేసాడు. విధేయులైనవారికి పరిశుద్ధాత్మ

అనుగ్రహించబడును. దీనిని మనం పూర్తిగా గ్రహించుకోలేక పోవచ్చును గాని దాన్ని మనం విశ్వసించగలము. నేను దీన్ని వ్రాయుచుండగా ఒక ఎలక్ట్రిక్ దీపము నాయొద్ద నున్నది. నాకు ఎలక్ట్రిసిటీ (విద్యుచ్ఛక్తి)ని గూర్చి పెద్ద తెలియదుగాని దాన్ని నేను ఉపయోగించుకొనుచున్నాను. అట్లే క్రైస్తవుని లోపల జీవించే పరిశుద్ధాత్ముడున్నాడు. మన జ్ఞానం పరిపూర్ణము కాకపోయినను మనలో నివసించే ఆత్మ సహాయాన్ని పొందగలము.

## లేఖనముల సంపూర్ణత్వం

మనం తెలిసికోవలసిన దాన్నంతటినీ క్రొత్త నిబంధన మనకు అందించుచున్నది. పరిశుద్ధాత్ముడు పౌలుద్వారా తిమోతికి ఇట్లు వ్రాయించాడు : "క్రీస్తు యేసునందుంచవలసిన విశ్వాసముద్వారా రక్షణార్థమైన జ్ఞానము నీకు కలిగించుటకు శక్తిగల పరిశుద్ధ లేఖనములను బాల్యమునుండి నీ వెరుగుదువు గనుక, నీవు నేర్చుకొని రూఢియని తెలిసికొన్నవి యెవరివలన నేర్చుకొంటివో ఆ సంగతి తెలిసికొని వాటియందు నిలుకడగా ఉండుము. దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమో 3:14-17). గనుక నేను దేవుని వాక్యాన్ని నేర్చుకోగలను, దేవుని వాక్యాన్ని నమ్మగలను, ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండగలనని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు. అయితే లేఖనములు నేర్చుకొనడంతోనే సరిపోదని మనం గ్రహించాలి. మన అంతరంగిక పురుషునిలో విశ్వాసమువలన ఆత్మ ద్వారా క్రీస్తు జీవించాలి. లేఖనములలో ఇట్లు వ్రాయబడియున్నది : "మీరు అంతరంగ పురుషునియందు శక్తికలిగి ఆయన ఆత్మవలన బలపరచబడునట్లుగాను, క్రీస్తు మీ హృదయములలో విశ్వాసముద్వారా

నివసించునట్లుగాను... ప్రేమయందు వేరుపారి స్థిరపడి యుండుడి" (ఎఫెసీ 3:16, 17).

## మనలో నివసించు ఆత్మ

మనలో నివసించు ఆత్మ సువార్తలో విచిత్రమైనది. పాత నిబంధనలో ఆత్మావేశమున్నది. పాత నిబంధనలో స్వస్థత యున్నది. సృష్టి సంబంధమైన అద్భుతములు, మోషేద్వారా జరిగించబడిన యద్భుతములు మనకున్నవి. క్రీస్తు కాలములో అపొస్తలులు చేసిన యద్భుతములున్నవి. అయితే దీని నంతటినీ మించిన దొకటియున్నది. యోహాను 7:37-39లో మనం ఇట్లు నేర్చుకొనగలము: "ఆ పండుగలో మహాదినమైన అంత్యదినమున యేసు నిలిచి - ఎవడైనను దప్పిగొనినయెడల నా యొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను. నాయందు విశ్వాసముంచువాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులోనుండి జీవజల నదులు పారునని బిగ్గరగా చెప్పెను. తనయందు విశ్వాసముంచువాడు పొందబోవు ఆత్మనుగూర్చి ఆయనే ఈ మాట చెప్పెను. యేసు ఇంకను మహిమ పరచబడలేదు గనుక ఆత్మ ఇంకను అనుగ్రహింపబడి యుండలేదు". గనుక యితరులెవరు పొందని రీతిగా క్రైస్తవునికి ఆత్మ వరము అనుగ్రహించబడింది. పరిశుద్ధాత్మ విశ్వాసికేగాని లోకమునకను గ్రహించబడలేదని మనము గమనించాలి. "సత్యస్వరూపియగు ఆత్మను మీ కనుగ్రహించును. లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు గనుక పొందనేరదు; మీరు ఆయనను ఎరుగుదురు, ఆయన మీతోకూడ నివసించును, మీలో ఉండును" (యోహాను 14:17). నమ్మినవానిని రక్షించడానికి సువార్త దేవుని శక్తియై యున్నది (రోమా 1:16). అయినను, పాపిని రక్షించడానికి పరిశుద్ధాత్ముడు కావాలని ఈ లోక ప్రజలు ప్రార్థిస్తారు! పాపి పరిశుద్ధాత్మను పొందలేడని యేసు చెప్పాడు.

మనం ఆత్మను పొందకపోతే దాన్ని పోగొట్టుకోలేము. ఆత్మను

ఆర్పకుడి. యని థెస్సలొనీకయులకు చెప్పబడింది (1 థెస్స 5:19). పాపము చేసి కొందరు ఆత్మలేని వారయ్యారని యూదా చెప్పుచున్నాడు (యూదా : 19).

నేను ఆత్మను కలిగియున్నానో లేదో ఎట్లు తెలుస్తాది? ఆత్మ ఫలము కలిగియుంటే తెలుస్తాది. ఒక పోరాటాన్ని గూర్చి పౌలు మనకు తెలియజేయుచున్నాడు. ఆత్మ శరీరమునకు వ్యతిరేకముగాను, శరీరము ఆత్మకు వ్యతిరేకముగాను పనిచేయును. ఈ రెండు ఒకదానికొకటి భిన్నముగా యున్నవి (గలతీ 5:16-21). "అయితే ఆత్మ ఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము; ఇట్టి వాటికి విరోధమైన నియమమేదియు లేదు" (గలతీ 5:22, 23). ఆత్మ మనలో నివసించాలంటే మనము శరీరమును దాని యిచ్ఛలతోను, దురాశలతోను సిలువ వేయాలి (24వ).

## చట్టబద్ధంగా పని చేయు దేవుడు

దేవుడు చట్టానుసారముగా పని చేయును. అద్భుతాలు చట్టానికి మినాయింపయినవి. ఆదామును ఆయన నేలమంటితో చేసాడు. హవ్వను ఒక ప్రక్క యెముకనుండి చేసాడు. గాని అప్పటినుండి ప్రకృతి చట్టము అమలులోనికి వచ్చింది. ఈలోకములోనికి వచ్చిన ప్రతి మానవుడు ప్రకృతి చట్టరీత్యా వచ్చాడు. మోషే నీటిని రక్తంగా మార్చాడు. అహా! అద్భుతం. గాని ప్రకృతి సూత్రప్రకారం మన శరీరంలో నీరు రక్తముగా ప్రతి దినము మారుచున్నది. అది అట్లు కానిచో మానవుడు భూమిమీదనుండి త్వరగా నాశనమౌతాడు. అద్భుతరీత్యా యేసు ఐదు వేల మందికి ఆహారము పెట్టాడు. ప్రకృతి సూత్రప్రకారం దేవుడు ప్రతిరోజు కోటానుకోట్ల ప్రజలకాహారం పెట్టుచున్నాడు. ప్రతి వరి, గోధుమ, జొన్న గింజలోను, ప్రతి బీజములోను జీవాన్ని పోసేవాడు దేవుడే, ఏ మానవుడు దాన్ని చేయలేడు. దేవుడు సూర్యరశ్మిని పంపు

చున్నాడు. ఏ మానవుడు దాన్ని చేయలేడు. సూర్యుని వేడి, వెలుతురు 9 కోట్ల 30 లక్షల మైళ్ళదూరంనుండి మనకు వచ్చుచున్నను, దాని ప్రభావము క్షీణించిపోవడంలేదు. మానవుడా పనిని చేయలేడు. ఆయన వర్షాన్ని పంపుచున్నాడు. మానవుడు పంపలేడు. గనుక దేవుని ప్రకృతిసూత్రాలు అద్భుతాలన్నిటికన్నా గొప్పవి. అయితే ఆయన శక్తిని చూపించడానికి ఈయద్భుతాలు చేయబడ్డాయి (మార్కు 16:19, 20; హెబ్రీ 2:3, 4). క్రొత్త నిబంధన ముగించబడినప్పుడు, ఈయద్భుతముల ప్రయోజనం సమాప్తమయ్యింది.

## మానవుని మార్చని అద్భుతాలు

పౌలు గొప్ప అద్భుతములు చేయగలిగినవాడే; అయితే అద్భుతముల ప్రయోజనం నెరవేరిపోయింది. ప్రవచనములు నిరర్థకములగును, భాషలు నిలిచిపోవునని అతడు చెప్పాడు (1 కొరింథీ 13:8). ప్రకటన గ్రంథంతో ప్రవచనం ఆగిపోయిందని యోహాను చెప్పుచున్నాడు (ప్రక 22:18, 19). అనారోగ్యంకొరకు ఔషధాన్ని వాడుమని పౌలు తిమోతికి చెప్పాడు (1 తిమో 5:23). విశ్వాస పోరాటాన్ని తుద ముట్టించిన ఈ వృద్ధసైనికుడు "త్రోఫిము రోగియైనందున అతని మిలేతులో విడిచి వచ్చితినని" చెప్పాడు (2 తిమో 4:20). అద్భుతములు చేయుచున్న మధ్యలోనే యేసు రోగికి వైద్యుడు కావాలని చెప్పాడు (మార్కు 2:17).

అద్భుతాలు మానవుని మార్చవు. బెయోరు కుమారుడైన బిలాము ప్రవక్త, అయినను దుష్కార్యము చేయడానికి అతడు వాంఛించాడు. కయప ప్రవక్త, క్రీస్తు మరణాన్ని గూర్చి ప్రవచించాడు గాని అతడొక దుష్టుడు. కొరింథులోని సంఘములో అనేక అద్భుత వరాలున్నాయి గాని, ఆ సంఘంలో అనేక పాపములున్నాయి. కాని ప్రతి క్రైస్తవుని హక్కు అయిన లోపల నివసించే ఆత్మ, మనను ఉన్నతస్థాయికి హెచ్చించును. "మృతులలోనుండి క్రీస్తు యేసును

లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మద్వారా జీవింపజేయును" (రోమా 8:11). ఆత్మ వచ్చినప్పుడు విశ్వాసినుండి జీవజలములు ప్రవహించుననీ యేసు చెప్పాడు. జీవజలమును ఉచితముగా పుచ్చుకొనడానికి ఆఖరి ఆహ్వానం ఇయ్యబడింది (ప్రక 22:17). (సమాప్తం)

## క్రైస్తవ్యానికి ఆధారం పునరుత్థానం

ఆత్మసంబంధమైన దేవుని రాజ్యములో క్రొత్తనిబంధన యను రాజ్యాంగ చట్టమునందు ప్రభువు పునరుత్థానమును గూర్చి ఆది అపొస్తలులు బహు విపులముగా ప్రకటించిన వర్తమానమును చూడగలము. అటువంటి పునరుత్థానమునకు అపొస్తలులు మాత్రమే సాక్షులని పరిశుద్ధాత్మ చెప్పుచున్నాడు. మతశాఖలలో మేమును అందులకు సాక్షులమని చెప్పుచున్నవారినీ మన మెరుగుదుము. అట్టివారు దొంగ అపొస్తలులని మోసగాండ్రయిన పనివారని పౌలు హెచ్చరించెను (2 కొరింథి 11 ; 13-14). అందరికి కడపట అకాలమందు పుట్టినట్టున్న నాకును కనబడెనని ఋజువుచేసెను (1 కొరింథీ 15:8). ఈమాట ఆఖరిగా నాకు మాత్రమే కనబడెనని అర్థమిచ్చుచున్నది గదా! పునరుత్థాన శక్తిని ఎరుగనివారు లేఖనమును బట్టి అబద్ధికులుగానే తేటపర్చబడిరి. అపొస్తలులు అనగా పంపబడిన వారనియు అందులకు తగిన అర్హతలు గ్రంథములో తప్ప చెప్పుకొనెడి వారియందు ఏ ఆధారమును కన్పించదు. అపొస్తలులు అయితే బహు బలముగా పునరుత్థానమునకు సాక్షులైరి (అపో. కా. 1:21-26+4:33).

ఆ కాలమందే పునరుత్థానము లేదని చెప్పుచున్న అవిశ్వాసులనేకులుండిరి. పెంతెకొస్తు దినమున పేతురు మాట్లాడుచు క్రీస్తు పాతాళములో విడువబడలేదనియు ఆయన శరీరము కుళ్ళిపోలేదనియు'

హృదయానుసారుడు దావీదు ముందుగనే చెప్పెనదెను. మరణము ఆయనను బంధించి యుంచుట అసాధ్యము గనుక మరణవేదనలు తొలగించి ఈ యేసుని దేవుడు లేపెను. అందువలన ఆయన పునరుత్థానమునకు మేమందరమును సాక్షులమని చెప్పెను (అపొ.కా. 2వ అధ్యా) (1 కొరింథీ 15:32). ప్రభువు పునరుత్థానము సువార్తకు జీవముపోసెను. కాబట్టి ఆదిక్రైస్తవులు ప్రభువు మృతులలోనుండి లేచెనని ప్రకటించుచుండిరి. పునరుత్థానము వారిని బలపర్చెను.

## ప్రథమ ఫలము క్రీస్తు

క్రీస్తు సంఘము యొక్క సరిహద్దులు విస్తరించుచున్నందున ప్రభువు వారికి సహకారుడుగా యున్నందున, రోమా ప్రభుత్వాధికారము సువార్తకును అపొస్తలులకును అడ్డుబండలుగా నిలిచిననూ బెదరించిననూ వారు భయపడక ఆదినుండి ఏది యుండెనో వారేది విన్నారో ఆ ప్రత్యక్షమైన నిత్యజీవమును గూర్చి భూదిగంతముల వరకు ప్రకటించుచునే యుండిరి. (అపొస్తలుల కార్యములు 4:17-20; 1 యోహాను 1:1-2). ప్రభువు వారికి తోడై యుండెను (మత్తయి 28:20). వారిమధ్య సంచరించుచుండెను (ప్రకటన 2:1).

అపొస్తలులయొక్క ప్రకటనలో క్రీస్తు ప్రథమ ఫలముగా లేచెనని ప్రకటించుచుండిరి (1 కొరింథీ 15:12-21). ప్రథమ ఫలముగా లేచుటయనగా నేమి? ఉదా :- బేతనియ గ్రామవాసి లాజరును మరియు యాయీరు కుమార్తెయును ఇంకనూ అనేకులు చనిపోయి మృతులలోనుండి లేపబడినను తిరిగి చనిపోయిరి. అయితే ప్రభువు ఇట్టివారివలె కాక రక్త మాంసములలో పాలివాడైననూ ఆయన ఆదియైయుండి మృతులలోనుండి లేచుటలో ఆదిసంభూతుడై నేను మొదటివాడను కడపటివాడను జీవించువాడను. మృతుడనైతినిగాని ఇదిగో యుగయుగములు సజీవుడనై యున్నానని (కొలస్స 1:18, ప్రకటన 1:18). తండ్రి తన కుమారుని మృతులలోనుండి లేపినందున పునరుత్థానమును

నమ్మటకు అందరికిని ఆధారము కలుగజేసెను (రోమా 1:4 అపో.కా. 17:31).

బేతనియలో ప్రభువు మార్తతో సంభాషిస్తూ నేనే పునరుత్థానమును జీవమును; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను మరలా బ్రతుకుననెను. కాబట్టి దేవునియొద్దకు వచ్చువాడు ఆయన ఉన్నాడనియు తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను (యోహాను 11:25, హెబ్రీ 11:6).

## అక్షయ శరీరం

ప్రభువు ప్రత్యక్షపుదినమునందు అందరూ తమ వయసులోనే బ్రతికింపబడుదురు (యోహాను 5:28-29). అయితే మృతులు ఏలాగు లేతురు? వారెట్టి శరీరముతో వత్తురని యొకడు అడుగును. ఓ అవివేకీ నీవు విత్తునది చచ్చితేనే గాని బ్రతికింపబడదు. దేవుడు తన చిత్త ప్రకారము నీవు విత్తినదానికి శరీరము ఇచ్చును (1 కొరింథీ 15:35-38). అక్షయులుగా లేపబడు ఆ దినమందు క్షయమైన ఈ శరీరము మార్పు జెంది అక్షయతను ధరించుకొనును (1 కొరింథీ 15:52-53).

మరణమునకు ఇక ప్రభుత్వము లేకుండా విజయమందు మరణము మ్రింగివేయబడును (1 కొరింథీ 15:53-56). ఆయన తన శక్తిని బట్టి మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపముగల దానిగా మార్చును (ఫిలిప్పీ 3:21). క్షయమైన ఈ శరీరముతోనే తీర్పునందు అగ్నికి పాత్రులుకావాలంటే బాహ్యప్రపంచములో భక్తి అవసరము లేదు. కారణము క్షణములోనే ఈ శరీరము కాలిపోవును. అక్షయమైన శరీరము కాలిపోకుండా వేదనమైన కఠిన శిక్షను అనుభవించవలెను. గనుకనే ఈ లోకమందు సర్వ మానవాళికి భక్తి అవసరమై మహోన్నతునితో సరియైన సంబంధము గల్గి జీవించవలయును. మానవకోటికి ఇదియే విధి (ప్రసంగి 12:13).

— G. ప్రకాశం, మద్రాసు-12.

## సమాజముగా కూడుట

సమాజముగా కూడుట దేవుని చిత్తమై యున్నది. అయితే కొందరు సమాజముగా కూడుట మానివేసిరి. ఎందుకు? ఆదిపరిశుద్ధుల రక్తము త్రాగిన రోమా ప్రభుత్వపు దినములు అలాంటివి. అందుకు హెబ్రీ గ్రంథకర్త సమాజముగా కూడుట మాననవద్దనెను (హెబ్రీ 10:24-25). ప్రభుత్వాధికారము వీరికి అడ్డుబండగా యుండి వారిని నిర్మూలము చేయదలచెను.

పరిస్థితులు ఎలాగున్నను ఆయన రాజ్యమును నీతినే మొదటిగా వెదకాలి (మత్తయి 6 : 33). మనము దేవునియొద్దకు రాగలిగితే దేవుడు మనయొద్దకు వచ్చును (యాకోబు 4:8). వాగ్దానము చేసిన వాడు నమ్మదగినవాడు గనుక ఆయన చిత్తప్రకారం సమాజముగా ఇద్దరైనా ముగ్గురైనా కూడినట్లయితే వారిమధ్య ప్రభువుంటాడు (మత్తయి 18:20). కాబట్టి నీయొక్క శ్రమయైనను బాధయైనను ఆయనయొద్ద విన్నవించుము. ఆయన సంఘముల మధ్య సంచరించుచున్నాడు గనుక నీ స్థితి ఎలాంటిదో ప్రభువెరుగును (ప్రకటన 2:1). ఆయన మనుష్యులకు విశ్రాంతి ననుగ్రహించును (మత్తయి 11:28).

దేవునియొద్దకు వచ్చువాడు ఆయన ఉన్నాడని తన్ను వెదకు వారికి ఫలము దయచేయుగలవాడని నమ్మవలెను (హెబ్రీ 11:6). దేవుని సన్నిధికి వచ్చుటకు ఆటంకములున్నా ప్రభుత్వము చర్య తీసు కొన్నా ప్రభువు దినమందు సమాజముగా కూడి దేవుని గౌరవించి, ఆరాధించి ఘనపరచడం మన బాధ్యతయై యున్నది. ఇదిగో నేను యుగసమాప్తివరకు సదాకాలము మీతో కూడా ఉంటానన్నాడు (మత్తయి 28:20).

నీవు ఏకారణముచేతనైనా కూడుట మానివేసినయెడల ఇంత గొప్ప రక్షణను నిర్లక్ష్యము చేసినట్లయితే ఎలాగు తప్పించుకొందువు? (హెబ్రీ 2 : 3). ప్రభువు కూడికలోను ప్రేమలోను మెడతెగక

యుండుము. ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడ వద్దనియు, ఆత్మను దేహాన్ని కలుగజేసిన దేవునికే భయపడి (మత్తయి 10:28), ఆ ప్రభు సన్నిధికి చేరినచో దేవుడు మనతో సహవాసము చేయును. కాబట్టి మనము లేఖనములద్వారా వినిన సంగతులు విడిచి పెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు విశేష జాగ్రత్త కలిగి యుండాలని దేవుడు కోరుచున్నాడు (హెబ్రీ 2:1).

— K. వేణుగోపాల్ చౌదీ్ర, నెల్లూరు.

---

బైబిలు గ్రంథం దేవుని వాక్యం - 10

## బైబిలునందారోపింపబడిన ప్రతిబంధకములు స్వవిరుద్ధ సంగతులు మొదలగునవి

## *(Alleged Difficulties & Contradictions in the Bible)*

బైబిలు విరోధులు, విమర్శకులు స్వవిరుద్ధ సంగతులవలె కన్పడు వాటిని పైకెత్తి చూపించుటలో ఆత్యానందాన్ని అనుభవిస్తారు. అయితే బైబిలులో స్వవిరుద్ధ సంగతులవలె కన్పడునవి ఉన్నవనుటలో సందేహము లేదు. గాని వాటిని కొంచెము శ్రద్ధగా చదివితే అవి తప్పక మాయమగును.

### స్వవిరుద్ధ సంగతులవలె కన్పడునవి

తార్సువాడైన సౌలు మార్పుజెందుటను గూర్చి వ్రాయబడిన రెండు వివరణములు స్వవిరుద్ధంగా యున్నాయని బైబిలు వ్యతిరేకులు ఆందోళన చేస్తూయుంటారు. అపొ.కా. 9వ అధ్యాయములో యున్న వివరాన్ని లూకా వ్రాసాడు. అయితే 22వ అధ్యాయములో పౌలు తన స్వంత వివరణ నిచ్చాడు. సౌలుతో ప్రయాణము చేసిన మనుష్యులు "ఆ స్వరమును వినిరిగాని యెవనిని చూడక మౌనులై నిలబడిరి" అని 9:7 లో లూకా వ్రాసాడు. అయితే పౌలు తన స్వంత వివరణ

నిస్తూ "నాతోకూడ ఉన్నవారు ఆ వెలుగును చూచిరిగాని నాతో మాటలాడినవాని స్వరమును వారు వినలేదు" అని చెప్పాడు (22:9).

మనము 'వినిరి' 'వినలేదు' అను రెండు పదములు ప్రయోగింపబడిన సందర్భాన్ని గమనిస్తే ఆ రెంటికిని మధ్యగల భేదము తొలగిపోవును. ఎవరితోనో మాటలాడుచు ఒక్కొకసారి 'మీరు చెప్పినది వినలేదండీ!' అంటాము. నిజానికి అతని స్వరాన్ని మనం వినినా, దానిని అర్థం చేసికోలేదని మన ఉద్దేశం. అదేవిధముగా 'వినలేదు' అను పదము ఇక్కడ ఉపయోగింపబడింది. పౌలుతోకూడ యున్నవారా శబ్దాన్ని వినిరని లూకా వ్రాయుటలో తప్పులేదు. పౌలుకూడ తనతో యున్న వారా శబ్దాన్ని వినిరిగాని దానిని అర్థం చేసికోలేదని చెప్పుటకు 'వినలేదు' అని చెప్పుటలో తప్పులేదు. ఈవిధంగా స్వవిరుద్ధ సంగతివలె కన్పడునది మాయమయ్యింది.

"ఎవడును ఎప్పుడును దేవుని చూడలేదని" చెప్పు యోహాను 1:18 కును, "ఇశ్రాయేలీయులు దేవుని చూచిరి" అని చెప్పు నిర్గమ 24:10 కిని మధ్య బహు భేదమున్నదని విమర్శకులు చెప్పుతుంటారు. ఇదొక స్వవిరుద్ధసంగతివలె కన్పడుచున్నను క్షణకాలపు టాలోచనతో అది అదృశ్యమగును.

దేవుడు తన నిత్యస్వభావమువలన అదృశ్యుడు (1 తిమో 1:17). ఆయన ఆత్మ గనుక భౌతిక నేత్రములకు కనబడడు (యోహాను 4:24). అందుచే ఎవడును ఎప్పుడును దేవుని చూడలేదని యోహాను వ్రాసినది తప్పుకాదు. దేవుడు ఆత్మ అయినను కొన్ని మారులు మానవునికి శరీరాకారముతో అగుపడుట కాయనకు ఇష్టమాయెను. దానినే మోషే అహరోనులు మరియు 70 మంది ఇశ్రాయేలీయుల పెద్దలు చూచారు (యెషయా 6:1). ఒక్కొకసారి మనం "మిమ్మును చూడలేకపోవుచున్నాను" అని చెబుతాం. నిజానికి మన ఎదటివాని శరీరాన్ని చూస్తున్నా ఆయన వ్యక్తిత్వాన్ని లేక అంతరాత్మను

చూడలేకపోవుచున్నామని మన యభిప్రాయం. నీ శరీరాన్ని నేను చూడగల్గినను నీ అంతరాత్మను నేనెన్నడు చూడనేలేదు. అల్లే ఏ మానవుడు ఎన్నడు దేవుని చూడలేదని చెప్పిన యేసు మాటలను యోహాను సరిగ్గానే వ్రాసాడు.

## ప్రతిబంధకములు

బైబిలునందు దుర్గమమైన ప్రతిబంధకములున్నవని అంగీకరించినను అవి దాని దైవావేశమును ఇసుమంతకూడ శంకింపజేయక దానినే నిరూపించుచున్నవి.

కయీను తన భార్యను ఎక్కడ సంపాదించుకొన్నాడు ? అనే ప్రశ్నకు సమాధానము దొరుకదని అనేకులు తలంచారు. 'కయీను నోదు దేశమునకు పోయి ఒక భార్య నచ్చుట తీసికొన్నాడని' బైబిలు చెబుతుందని విమర్శకులు చెబుతూ యుంటారు. అయితే బైబిలు ఆలాగున చెప్పుటలేదు. "అప్పుడు కయీను యెహోవా సన్నిధిలో నుండి బయలుదేరి వెళ్ళి ఏదెనుకు తూర్పు దిక్కున నోదు దేశములో కాపురముండెను. కయీను తన భార్యను కూడినప్పుడు ఆమె గర్భవతియై హనోకును కనెను" అని బైబిలు చెప్పుచున్నది (ఆది 4:16, 17). దీనినిబట్టి నోదు దేశమునకు వెళ్ళకమునుపే కయీను ఒక భార్యను కలిగి యుండెనని ఋజువగుచున్నది. అయితే ఆమె ఎవరు ?

ఆదికాండము 5:3, 4 వలన ఆదాము నివసించిన 930 సంవత్సరముల దీర్ఘకాలములో అతడనేక కుమారులను కుమార్తెలను కనెనని మనకు తెలియును. గనుక కయీను ఆదాము కుమార్తెలలో నొకదానిని పెండ్లియాడి యుండవచ్చును. అయితే కయీను తన స్వంత సోదరినే వివాహమాడెనని మనము శంకిస్తే, మానవజాతి అంతయు ఆదాము హవ్వల మూలముననే కలుగవలెను గనుక వారి కుమారులును కుమార్తెలును ఒకరినొకరు వివాహ మాడిరని మనము గమనించాలి. అబ్రహాము కూడ తన (అర్థ) చెల్లెలిని వివాహమాడెను

(ఆది 20:12). గనుక కయీను తన స్వంత సోదరినే వివాహ మాడుటకు ఇష్టపడియుండి, దేవుడు దానికి సమ్మతించినయెడల మన మెందుకు వ్యతిరేకించాలి?

## చారిత్రిక సంగతులు

బైబిలునందలి చారిత్రిక సంగతులతో అద్భుతములు కూడ మిళితమై యున్నందున వాటి యథార్థతను ఒక్కొకసారి అనుమానితులు ప్రశ్నించుట కద్దు. అట్టివానిలో 'యోనా - తిమింగిలము' సంగతి ఒకటి.

తిమింగిలము నోరు మానవుని మ్రింగుటకు అనుకూలముగా లేనందున ఈ సంగతి సత్యము కాదని చాలమంది చెప్పుదురు. అయితే యోనాను మ్రింగినది తిమింగిలము అని చెప్పినదెవరు? "గొప్ప మత్స్యము ఒకటి యోనాను మ్రింగవలెనని యెహోవా నియమించి యుండగా యోనా మూడు దినములు ఆ మత్స్యముయొక్క కడుపులో ఉండెను" అని యోనా 1:17 చెప్పుచున్నది. దీనిని గూర్చి యేసు చెప్పిన సంగతికూడ సత్యమే (మత్త 12:40). యోనా మూడు రేయింబగళ్లు తిమింగిలము కడుపులో యుండెనని ఆయన చెప్పినట్లిచ్చట వ్రాయబడినది. అయితే ఆదిమ గ్రీకుభాషలో ఇక్కడకూడ తిమింగిలము అను పదము వాడబడలేదు. గొప్ప సముద్రపుచేప అని అందు వ్రాయబడినది. బైబిలు అనువాదకులు ఆ పదాన్నే ఇక్కడకూడ ఎందుకు వాడలేదో మనమెరుగము. గనుక యోనా తిమింగిలముచే మ్రింగబడెనని చెప్పువారు బైబిలు చెప్పనిదాన్ని చెప్పుచున్నారని మన మెరుగుదుము.

ఒకవేళ యోనాను తిమింగిలమే మ్రింగెనని బైబిలు చెప్పినను అది అసాధ్యము కాదు. కొన్ని రకములైన తిమింగిలములు మానవుని మ్రింగలేవనునది నిజమే అయినను Sperm Whale అను తిమింగిలము గుర్రములవంటి పెద్ద జంతువులను మ్రింగగలదని తెలిసికొన

బడినది. గనుక యోనాకు మూడు రేయింబగళ్లు ఉచిత వసతి నొక తిమింగిలము ఇచ్చెనని చెప్పుట సత్యమున కేమియు దూరముగా లేదు.

అసలు మానవుడు తిమింగిలము కడుపులో మూడు రోజులు జీవించి యుండగలడా? అనుదాని నిప్పుడు చెప్పుకోవలసి యున్నది. ఇదికూడ అసాధ్యము కాదని ఇటీవల నిరూపింపబడినది. ఇంగ్లీషు కాలువలో పడిపోయి మానవులెవరు రక్షించకముందే ఒక పెద్ద సొర చేపచే మ్రింగబడిన నావికునిగూర్చి కొన్ని సంవత్సరముల వెనుక వార్తాపత్రికలు ప్రకటించాయి. 48 గంటల తరువాత ఆ చేపను పట్టుకొని ఆ నావికుని గౌరవప్రదమైన సమాధి చేయుదమని దాని కడుపును విప్పుసరికి ఆ నావికుడు జీవించే యుండెను గాని అస్పృహా స్థితిలో యుండెను. అతనిని ఆసుపత్రిలో చేర్చగా అతడు ఆకస్మిక అఘాతము **(Shock)** వలన బాధపడుచున్నట్లు నిర్ణయించి కొన్ని గంటల తరువాత డిస్చార్జి చేసిరి. మనకు తెలిసినంతవరకు ఇతడు ఎవరి సహాయము లేకనే రెండు రోజులు సొరచేప కడుపులో జీవించెను. దేవుని కటాక్షమువలన యోనా ఇతనికంటె ఇంకొక రోజు ఎక్కువ నివసించాడనుట సమంజసము కాదా? అవును, అది సాధ్యమే.

గనుక ప్రియ చదువరీ పురాతన గ్రంథమగు బైబిలు సత్యమని నిరూపించుటకు ఋజువులనేకము నిచ్చుచు నిన్ను దేవునికి, ఆయన వాక్యమునకు అప్పగించుచున్నాము. ఈ దైవ గ్రంథమును నీ జీవిత పాఠశాలలో ఒక అచ్చు పుస్తకమువలె నుంచుకొనుము. జ్ఞానుడవగుటకు దాని ననుసరించుము. రక్షింపబడుటకు దానిని విశ్వసించుము. నీ జీవితాంతమున దేవుని యెదుట తీర్పుకు నీవు నిలబడునప్పుడు నీ ఆత్మ గత్యంతరాన్ని నిర్ణయించేది బైబిలు గ్రంథమే యని గ్రహించు. అది దేవుని వాక్యము!!

—మోరిస్ బెయిలీ.

[గమనిక : బైబిలుగ్రంథం దేవుని వాక్యం అనే శీర్షికపై గత పది మాసములలోను వెలువడిన వ్యాసములు సహో. మోరిస్

W.R. బెయిలీగారు ఆంగ్లములో 30 సంవత్సరముల క్రితం వ్రాసిన "The Bible is God's Word" అనేపుస్తకంనుండి సేకరించ బడ్డాయి. ఈ వ్యాసములద్వారా అనేకులు విశ్వాసములో బలపడ్డార నియు, అవిశ్వాసులు విశ్వాసులు కాగలిగారనియు మా నమ్మకము.]

---

## పాపములో జన్మించితివా?

### (Born in Sin?)

మానవుడు పాపములో జన్మించాడని అనేకులు బోధిస్తారు. బైబిలు నెరుగనివారు అది యధార్థమని నమ్ముతారు. ఆదాముయొక్క పాపము మానవజాతి కంతకు సంతరించినదని బైబిలు బోధించుట లేదు.

"తండ్రియొక్క దోష శిక్షను కుమారుడు మోయుటలేదని" యెహెజ్కేలు 18:20 చెప్పుచున్నది. ఆదాముయొక్క పాపాన్ని చిన్న పిల్లలు వారసత్వంగా పొందరని చెప్పడానికి ఈ వచనం ఒక్కటే చాలు. చిన్నపిల్లలను గూర్చి చెప్పినప్పుడు వారు పాపంలో యున్నారని యేసు చెప్పలేదు. సరిగదా "అట్టి వారిదే పరలోకరాజ్యమని" ఆయన చెప్పాడు (మత్తయి 19:14).

ఒకని పూర్వీకుల పాపమువలన చిన్న బిడ్డ నొకనిని శాశ్వతంగా దేవుడు శిక్షిస్తే అది చాల అన్యాయమౌతాది. అయితే ప్రతివ్యక్తి దేవునియొద్ద తీర్పు తీర్చబడతాడు. అయితే వేరొకడు ఏదైనా చేసింది లేక చేయలేనిదనే దానినిబట్టి గాక ప్రతి వ్యక్తి తాను చేసిన క్రియ లకు తీర్పు నొందుతాడని బైబిలు బోధించుచున్నది. "మనమందరము దేవుని న్యాయపీఠము ఎదుట నిలుతుము...గనుక మనలో ప్రతి వాడును తన్నుగురించి దేవునికి లెక్క యొప్పగించవలెను" (రోమా 14:10, 12).

(మిగిలింది పైటిలు 3వ పేజీలో)

# యేసుక్రీస్తులో మన సంబంధము

"వీరు గొఱ్ఱెపిల్ల రక్తములో తమ వస్త్రములను ఉదుకుకొని వాటిని తెలుపు చేసికొనిరి" ప్రకటన 7:14

| యేసుక్రీస్తు | | సంఘము | | క్రైస్తవుడు | |
|---|---|---|---|---|---|
| శిరస్సు | ఎఫెసీ 1:22, 23 | శరీరము | కొలస్స 1:18 | అవయవము | 1 కొరి 12:27 |
| రక్షకుడు | 1 యోహా 4:14 | రక్షింపబడినవారు | ఎఫెసీ 5:23 | రక్షింపబడినవాడు | రోమా 8:24 |
| విమోచకుడు | తీతు 2:14 | విమోచింపబడినవారు | 1 పేతు 1:19 | విమోచింపబడినవాడు | ఎఫెసీ 1:7 |
| పవిత్రపరచువాడు | ఎఫెసీ 5:26 | పవిత్రపరచబడినవారు | 1 కొరి 6:11 | పవిత్రపరచబడినవాడు | ప్రక 1:5 |
| పరిశుద్ధపరచువాడు | 1 కొరి 6:11 | పరిశుద్ధపరచబడినవారు | 1 కొరి 1:2 | పరిశుద్ధుడు | ఫిలిప్పీ 1:1 |
| దేవుని వారసుడు | రోమా 8:17 | తోడి వారసులు | రోమా 8:17 | దేవుని వారసుడు | గలతీ 3:29 |
| రాజు | 1 తిమో 6:15 | రాజ్యము | హెబ్రీ 12:28 | పౌరుడు | ఎఫెసీ 2:19 |
| గొఱ్ఱెల కాపరి | యోహాను 10:14 | గొఱ్ఱెల మంద | యోహా 10:16 | మందలోయున్నవాడు | అపొ.కా. 20:28 |

"కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి" 2 కొరింథీ 5:17

(౧౫వ పేజీ తరువాయి)

ప్రతివాని జీవితంలోను మంచి చెడ్డలను తెలిసికొనే ప్రాథమిక జ్ఞానం కలిగిన సమయం వచ్చును. అతడు చెడుగును చేయడానికి (అంటే దేవుని చిత్తానికి భిన్నంగా చేయడానికి) నిశ్చయించుకొన్నప్పుడతడు పాపము చేయును. అయితే మంచి చెడ్డల భేదము తెలియని చిన్నపిల్లలు, వాటి నెంచుకొనే శక్తిలేని చిన్నపిల్లలు పాపమును కలిగియుండరు. వారు పాపంలో లేరు. బైబిలు అట్లు బోధించుచున్నది.

—రోజర్ ఫిఫ్టలెట్.

---

## లాజరు అక్కడ ఉన్నాడు

### *(Lazarus was There)*

"...లాజరు ఆయనతో కూడ భోజనమునకు కూర్చున్న వారిలో ఒకడు" (యోహాను 12:2). ఒక విందు జరుగుచుండెను. యేసుప్రభువు గొప్ప మాటలు చెప్పుచుండెను. పన్నెండుమంది అపొస్తలులు మార్త యింటిలో నుండిరి. అయితే ఒకమాట మనలను ఆకట్టుకొనుచున్నది. "లాజరు ఆయనతో కూడ భోజనమునకు కూర్చున్నవారిలో ఒకడు".

లాజరునుగూర్చి ఈ మాటలు ఎందుకు చెప్పబడ్డాయి? లాజరు అతని సోదరీలగు మరియ, మార్తలు యేసుకు మంచి మిత్రులు (యోహాను 11:5). అంతకు కొన్ని దినముల ముందే లాజరు రోగియై మరణించాడు. యేసు అక్కడికి వచ్చినప్పుడు లాజరును బ్రదికించి అందరినీ ఆశ్చర్యపరచాడు.

ఈ విందులో లాజరు ఎందుకున్నాడు? అతనికి మరింకేమీ పనిలేదా? వేరే మిత్రులు లేరా? వృత్తి వ్యాపారములేమీ లేవా? బహుశ ఇవన్నీ అతనికి ఉండవచ్చును గాని యేసు అనుచరులతో అతడు ఉండగోరాడు.

యేసు అక్కడ ఉన్నాడు గనుక లాజరు అక్కడ హాజరయ్యాడు. ఒక మిత్రునివలె ప్రేమించడమే గాక, తన ప్రభువును రక్షకునివలె అతడాయనను ప్రేమించాడు. యేసు లాజరుకు ఏమాత్రం దగ్గరగా యున్నా, అతడాయన చెంతనే యుండడానికి ప్రయత్నించేవాడు.

కృతజ్ఞత కలిగినవాడు గనుక లాజరు అక్కడున్నాడు. అతడొక సమాధిలో యున్నాడు. యేసు వచ్చి 'లాజరూ, లెమ్ము' అని చెప్పే సరికి అతడు చనిపోయి నాలుగు దినములమట్టుకు సమాధిలోయున్నాడు. మృతుడై యుండి అతడెట్టి అనుభవాన్ని కలిగియుండెనో మనకు తెలియదు గాని అతడు తన కుటుంబముతో తిరిగి కలుసుకున్నాడు. అందువలన కృతజ్ఞత కలిగియున్నాడు.

నీవక్కడ ఉన్నావా? ప్రభువుయెడల లాజరుకున్నట్టి కృతజ్ఞత, నమ్మకము నీకున్నదా? మృతులలోనుంచి లాజరును లేపింది ఆయనే. ఆయనే నిన్ను కూడ ఇంకో భావములో మృతులలోనుండి లేపాడు గదా? (రోమా 6:3, 4). ఆయన భూమిమీద తన మిత్రులనెట్లు ప్రేమించాడో అట్లే నిన్నుకూడ ప్రేమించుచున్నాడు. అనేక పనుల తొందరలవలన నేను నీయొద్దకు రాలేకపోవుచున్నానని లాజరు ప్రభువుకు కబురు పంపితే ఆయన తన మనసులో గాయపరచబడి యుండడా? నీ పనుల తొందరలవలన నీవు ప్రభువు సన్నిధికి రాలేకపోతే ఆయన గాయపడడా? లాజరు అక్కడున్నాడు. నీవక్కడ ఉన్నావా? ★

Regd. No. H/KD—45/KD. H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To

..............................

..............................

..............................

..............................